నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్

విశాలాంధ్ర - విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల కౌంటింగ్ ప్రక్రియ గురువారం జరగనుంది. ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులతో పాటు, ఇతరులు కూడా ఉత్సాహంగా పోటీకి సై అన్నారు. మొత్తం 37 మంది బరిలో నిలిచినప్పటికీ పోటీ మాత్రం ప్రధాన పార్టీ అభ్యర్థుల నడుమే ఉంటుందని తెలుస్తోంది. ఈ నెల 13న జరిగిన ఎన్నికలలో గతంలో కంటే పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఉత్తరాంధ్ర పట్టభద్రులకు సంబంధించి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో 2,89,214 ఓటర్లుండగా 1,72,851 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక విజయనగరం జిల్లా విషయానికొస్తే జిల్లాలో 58,502 మంది ఓటర్లు ఉండగా 75 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 43,862 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, వీరిలో 29,162 మంది పురుషులు, 14,700 మంది మహిళలున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం పెరిగింది. అయితే ఈ ఎన్నికలలో తమ ఓట్లు గల్లంతయ్యాయనేవారు, తమ ఓటు ఎవరో వేసారనేవారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. పట్టభద్రులు కానివారిని కూడా ఓటర్లుగా చేర్చి, ఓటింగ్ చేయించారనే విపక్షాల విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయం ఎవరిని వరిస్తుందనేది చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు గ్రామ స్థాయిలో అధికార పార్టీ పరిస్థితి బాగుందని, పట్టణాల్లో మాత్రం వ్యతిరేకత ఉందనే ప్రచారం సాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాలకు చెందిన పట్టభద్రులు తప్పకుండా ప్రభుత్వ వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశం ఉందనే ఊహాగానాలు సాగాయి.

కానీ జిల్లాలో ఓటింగ్ సరళి పరిశీలిస్తే మండల స్థాయిలో ఎక్కువ పోలింగ్ జరుగగా, పట్టణాల్లో మాత్రం కాస్తా తక్కువగా ఓటింగ్ జరిగింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో బిజెపి, వైసిసి, టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల నడుమ పోటీ ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పోలింగ్ రోజున ఓటర్లు వచ్చిన తీరు గమనించిన వారికి సాధారణ ఎన్నికలు పరిస్థితులు కనిపించాయి. మొత్తం మీద 50 శాతం ఓట్లు చేజిక్కించుకున్నవారికి విజయం దక్కుతుంది.

ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల విజయానికి మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు, రెండవ ప్రాధాన్య ఓటు కూడా కీలకం కానుంది. మొత్తం 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికే ప్రధాన రాజకీయ పక్షాల్లో విజయం ఎవరి పక్షాన నిలుస్తుందనేది మరి కొన్ని గంటల్లో తేలనుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో గురువారం కౌంటింగ్ మాత్రమే జరగనుంది. తుది ఫలితాలను కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రకటించే అవకాశముంది.

భూముల రీసర్వే నెలాఖరులోగా పూర్తిచేయాలి

కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర - విజయనగరం /డెంకాడ/ పూసపాటిరేగ: సమగ్ర భూముల రీసర్వేను నెలాఖరులోగా పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.సూర్య కుమారి రెవిన్యూ అధికారులు, సర్వే సిబ్బందిని ఆదేశించారు. భూముల రీసర్వే జరుగు తున్న తీరును పరిశీలించే నిమిత్తం జిల్లా కలెక్టర్ బుధవారం పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో పర్యటించారు. పూసపాటిరేగ మండలం లంకలపల్లి పాలెం, డెంకాడ మండలం గంట్లాంలో రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అవసరమైన సంఖ్యలో గ్రామ సర్వేయర్లను డిప్యూటేషన్‌పై రీసర్వే పనుల కోసం నియమించినందున వారి సేవలను వినియోగించుకొని త్వరగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. డెంకాడ మండలంలో రెండు బృందాలతో రీసర్వే జరుగుతున్నట్టు తహశీల్దార్ ఆదిలక్ష్మి వివరించారు. పది గ్రామాల్లో పూర్తిచేశామని, మరో 16 గ్రామాల్లో పూర్తికా వలసి వుందని వివరించారు. పూసపాటిరేగలో రీసర్వే జరుగుతున్న లంకలపల్లి పాలెంను సందర్శించి డిప్యూటీ తహశీల్దార్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.

తాటిపూడి రూటులో బస్సు సర్వీసు వేళల సవరింపు

ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఇంటర్ పరీక్షల దృష్ట్యా ఈనెల 29వ తేదీ వరకు ఎస్.కోట-తాటిపూడి మీదుగా విజయనగరం వెళ్లే బస్సు సర్వీసు వేళలను ఉదయం 6.30 గంటలకు బదులుగా ఉదయం 6.45 గంటలకు బయలుదేరుతుందని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ బుధవారం ప్రకటించారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో వచ్చిన పలు సూచనలను డిపో మేనేజర్ కె.రమేష్ వివరిస్తూ.. ధర్మవరం-విజయనగరం బస్సు సర్వీసులు రిక్వెస్ట్ స్టాపుల్లో డ్రైవర్లు బాగానే నిలుపుదల చేస్తున్నారని, స్టాఫ్ మంచివారని అయితే నిర్ణీత వేళలు దాటిపోతున్నాయని, ఈ రూటులో ఒక స్టేజి తగ్గించారని, దీంతో గంట్యాడ పీహెచ్సీ స్టాఫ్ రిక్వెస్ట్ స్టాప్ లేకుండా చేశారని, దీన్ని మార్చాలని ఒక ప్రయాణికుడు డీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే విజయనగరం-ధర్మవరం, ఎస్.కోట రూటులో నైట్ బస్సు 9.30 వేళకు ఉందని..ఈ బస్సు సర్వీసును రాత్రి 10గంటలకు మార్చాలని ఒక ప్రయాణికుడు కోరారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్‌ఐఓ ఎం.సత్యనారాయణ తెలియజేశారు. తొలిరోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 19,880 మంది సాధారణ విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 19,140 మంది విద్యార్థులు హాజరై 740 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 5,945 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,249 మంది విద్యార్థుల హాజరై 696 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షకు 24,389 విద్యార్థులు హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాలలో పూర్తిస్థాయి సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలను నిర్వహిస్తున్నామని ఆర్‌ఐఓ ఎం.సత్య నారాయణ తెలిపారు. విద్యార్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్కు పాల్పడితే సహించేది లేదని దీనిని విద్యార్థులంతా పరిగణలోకి తీసుకోవాలన్నారు.

ఉపాధి హామీ పనులు ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర - వంగర: మండలంలో సంగాం గ్రామంలో సత్తారు ట్యాంక్‌లో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపిడివో శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. చెరువులో 90 మంది ఉపాధి హామీ పనులను చేస్తున్నట్టు ఆయన తెలియజేశారు. మస్టర్ పరిశీలన చేసి, ఉపాధి హామీ పనులు చేస్తున్న హాజరు పట్టికను తనిఖీ చేశారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రతిరోజు 257 రూపాయలు కూలి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

నీట్‌లో సాయిమాధురికి 1987వ ర్యాంకు

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణం సాయి నగర్‌లోని శ్రీ చైతన్య విద్యానికేతన్‌లో గతంలో పదో తరగతి వరకు విద్యను అభ్యసించిన సాయిమాధురికి ఇప్పుడు ఎంబిబిఎస్ నీట్ 2023లో ప్రకటించిన ఫలితాల్లో ఆల్ ఇండియాలో 1987వ ర్యాంకు సాధించింది. బుధవారం శ్రీ చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ గౌరీ శంకర్, సెక్రెటరీ డి.పద్మ స్కూల్ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ సాయి మాధురి వైద్య రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకో వాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ గౌరీ శంకర్ మాట్లాడుతూ తమ స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని విద్యార్థులకు విద్య అనంతరం వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్లను అందిస్తున్నట్టు తెలిపారు.

రౌడీ రాజకీయాలకు తెరలేపుతున్న వైసీపీ

మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు

విశాలాంధ్ర - డెంకాడ: వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో రౌడీ రాజకీయాలకు తెరలేపుతుందని ఇది మంచి పద్ధతి కాదని డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు అన్నారు కాగితాల సత్యనారాయణ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ గూండాలు 6 ఎకరాల సరుగుడు తోటను కాల్చి వేసిందని, ఇది రౌడీ రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను సహించేది లేదని, వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకొని ఇటువంటి కార్యక్రమాలకు వైసిపి వారు పాల్పడుతున్నారని అన్నారు. కక్ష కట్టి అనేక తప్పుడు కేసులను పెట్టించి భయభ్రాంతులను చేసి, ఆర్థికంగా దెబ్బతియ్యాలనే ఉద్దేశ్యంతో 6ఎకరాలు సరుగుడు తోటని వైసీపీ గూండాలు కాల్చి వేయడం అత్యంత దారుణమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, డెంకాడ మండల టీడీపీ అధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, విజయనగరం పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణీరాజు, పడాల చిన్నారావు, మాజీ సర్పంచ్ మండల పార్టీ జనరల్ సెక్రటరీ కోయనేని రమణ, మాజీ ఎంపీటీసీ కొర్నాన ఆదిబాబు, పిన్నింటి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

సచివాలయంలో సక్రమంగా అందని సేవలు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయంలో 18 మంది వాలంటీర్లు, 9 మంది సచివాలయం సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజలకు సేవలు అందించడంలో విఫలం అవుతున్నారు. ఇందులో సగం మంది సచివాలయంకు వచ్చి హాజరు వేసుకోవాల్సిన ఆలోచన కూడా మర్చి విధుల్లో ఉన్నామని ఒకరికి ఒకరు సపోర్ట్ చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సచివాలయం సిబ్బంది పరిస్థితి చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలకు తూట్లు పొడిచినట్లు ఉందని అన్నారు. ఇప్పటికైనా లోచర్ల సచివాలయం సిబ్బంది సక్రమంగా సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, తదితర అంశాలపై కలెక్టర్ ప్రశ్నించారు. ఈ కేంద్రంలో 347 మంది విద్యార్థులకు గాను 281 మంది విద్యార్థులు హాజరయ్యారని, 66 మంది గైర్హాజర య్యారని చీఫ్ సూపరింటెండెంట్ బొబ్బిలి రేణుక తెలిపారు. వేసవి దృష్ట్యా తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని సబ్ ఇన్స్పెక్టర్ నీలకంఠంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపార్టుమెంటు అధికారి దొగ్గ తవిటి నాయుడు, ఉపతహశీల్దార్ షేక్ ఇబ్రహీం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

విశాలాంధ్ర - పార్వతీపురం: ఏప్రిల్ 3 నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు హాజ రయ్యే విద్యార్థులకు పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. బుధవారం పార్వతీపురం ఐటీడీఏ సమావేశ మందిరంలో పరీక్షలపై, విద్యా సంబంధిత అంశాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికార్లు, మండల విద్యాశాఖ అధికా రులతో ఆయన సమీక్షించారు. వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో బడిబయట పిల్లలు ఎవరూ ఉండరాదని సూచించారు. జగనన్న గోరు ముద్ద క్రింద సంపూర్ణ పోషణ విద్యార్థులకు అందాలని, ముఖ్యంగా బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. రక్త హీనత ఉన్నవారిపట్ల నిశిత దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎస్.డి.వి.రమణ, డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు, టి.పి.ఎం.యు ఏపీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

21 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు



విశాలాంధ్ర - బెలగాం : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభ౦మయ్యాయని జిల్లా వృత్తి విద్యాధికారిణి మంజులా వీణ అన్నారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 4,526 మందికి 255 గైర్హాజరయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు 2,702 మందికి 340 గైర్హాజరయ్యారు.

ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా సేకరించాలి

విశాలాంధ్ర - బెలగాం: రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణమే ఆర్.బి.కెల ద్వారా సేకరించాలని, రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా పౌరసరఫరాల శాఖ

మేనేజర్‌కు వినతి అందించారు. షెడ్యూల్ అయిన ధాన్యానికి మిల్లులను ట్యాగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కిమిడి రామ్మూర్తినాయుడు, వెలమల సత్యనారాయణ, యామల సింహాచలం, వండాన కూర్మారావు, మాధవరావు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు పక్కాగా వేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: నిర్దేశించిన తేదీలోగా చిన్నారులకు టీకా పక్కాగా వైద్య సిబ్బంది వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన సీతానగరం మండలం బూర్జ, పెదంకలాం గ్రామా ల్లో నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని పర్య వేక్షించారు. తప్పనిసరిగా టీకా గడువు తేదీలను చిన్నారుల తల్లిదండ్రులకు తెలియపరచి నిర్దేశించిన తేదీలోగా వేయాలని, వేస్తున్న ప్రతి టీకా యొక్క ఆవశ్యకతను వివరించాలని సూచించారు. వేసవికాలంలో చిన్నారుల పట్ల తల్లి దండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జి.వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల నిర్వహణ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు 442 మంది విద్యార్థులకు గాను 414 విద్యార్థులు పరీక్షలు రాశారని 28 మంది విద్యార్థులు పరీక్షకు పూర్తిగా హాజరు కాలేదని తెలిపారు.

అందరి చూపు విశాఖ స్వర్ణభారతి వైపే...

గెలుపులో కీలకంకానున్న రెండో ప్రాధాన్యత ఓటు

విశాలాంధ్ర - పార్వతీపురం: మరో 30 గంటల్లో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తేలనున్నవేళ అందరి చూపు విశాఖపట్టణం స్వర్ణభారతి స్టేడియం వైపే ఉన్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈనెల 13న జరిగిన (సోమవారం) ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలకంటే దీటైన రీతిలో జరిగాయి. ఎన్నికలు వాస్తవంగా చదువుకున్న పట్టభద్రులకు అయినప్పటికీ వారికంటే సగటు ఓటర్లు, రాజకీయ నాయకులకే అన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్నడూ లేనివిధంగా ఈఎన్నికలు నువ్వా..నేనా అన్నరీతిలో రాజకీయ పక్షాలు తీసుకొని ఓటర్లు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా చివరకు ఫలితాలు మాత్రం వామపక్షాలు, ప్రజా సంఘాలు బలపర్చిన స్వతంత్ర అభ్యర్థివైపు వచ్చే అవకాశం ఉందని అన్ని వర్గాల వారు చెబుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ పట్టణం, అనకాపల్లి జిల్లాల నుంచి 331 పోలింగు స్టేషన్లు పరిధిలో ఎన్నడూ లేనివిధంగా 2లక్షల 89వేల 214మంది పట్టభద్రులు ఓటును నమోదు చేసుకున్నారు. సోమవారం జరిగిన ఎన్నికలలో లక్షా 72వేల 851మంది పట్టభద్రులు (59.77శాతం) ఓట్లును వేశారు. ఈ ఎన్నికలలో 37 మంది అభ్యర్థులు పోటీ చేసినప్పటికీ వారిలో ముగ్గురు మాత్రమే పార్టీల తరుపున పోటీ చేయగా మిగిలిన 34 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. వీరిలో అధికార పార్టీ వైసీపీ అభ్యర్థి సుధాకర్, ప్రతిపక్షపార్టీ టిడిపి అభ్యర్థి చిరంజీవిరావు, బీజేపీ అభ్యర్థి మాధవ్, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కోరాడ ప్రభావతిల మధ్యే ప్రధాన పోటీ జరిగింది. వీరిలో వామపక్షాలు, ప్రజాసంఘాలు మద్దతుతో పోటీచేసిన రమాప్రభ గెలుపుపై ఎక్కువమంది ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఈ ఎన్నికలలో ఉత్తరాంధ్రలో ప్రధాన కులాలైన కాపు, కొప్పల వెలమల మధ్య కూడా జరిగిందని కుల సంఘాల నేతలు చెప్పడం కూడా గమనార్హం. దానిలో తెలుగుదేశం, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య పోటీ ఉందని ఉన్నారని పలువురు అంటున్నారు. ఏదిఏమైనా నేడు విశాఖపట్టణంలోని స్వర్ణభారత్ స్టేడియంలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. నేడు జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పరిశీలిస్తే ముందుగా 331పోలింగు బూత్‌ల బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను ఒక డ్రమ్ములో కుమ్మరించి వాటిని కలిపేస్తారు. దీని ద్వారా ఏ పోలింగ్ స్టేషన్లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలిసే అవకాశం ఉండదు. అభ్యర్థి గెలుపునకు చెల్లిన ఓట్లలో సగం మొదటి ప్రాధాన్యత ఓటు రావాలి. ఏదిఏమైనా రెండో ప్రాధాన్యత ఓటు హక్కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించడం ఖాయం.

పలువురు మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం: అసెంబ్లీ సమావేశాలలో పాల్గొనే నిమిత్తం అమరావతి వెళ్లిన ఎమ్మెల్యే జోగారావు బుధవారం రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితను, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితర మంత్రులను, పలువురు ఎమ్మెల్యేలను అసెంబ్లీ లాబీలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజక వర్గంలో పలు సమస్యలను ఆయా మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. ఆయనతో పాటు వైసీపీ సీనియర్ నేత, సీతానగరం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పోల ఈశ్వర నారాయణ ఉన్నారు.

పని గంటలు పెంచి కార్మిక శక్తిని దోచుకుంటున్నారు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ప్రభుత్వాలు ఉపాధి హామీ పనుల్లో కూలీలకు పని గంటలు పెంచి కార్మిక శక్తిని దోచుకుంటున్నాయని అఖిల భారత గ్రామీణ, వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సంఘం ఆరోపించారు. బుధవారం ఆయన పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణ పురం పంచాయతీలో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని ఆరోపించారు. అందులో భాగంగా పని వేళలు పెంచుతూ కూలీలను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెడుతు న్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు అందించి 200 పని దినాలు కల్పించాలని, రోజుకు 600 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని, నిలిచిపోయిన పాత బకాయిలు తక్షణమే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాలకొండ మండల కార్యదర్శి బెజ్జవరపు వెంకటరమణ పాల్గొన్నారు.

కార్మికుల పట్ల ఎందుకింత నిర్లక్ష్యం...?

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాణాలకు తెగించి పనులు చేస్తూ కంటికి రెప్పలా కాపాలా కాస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ కార్మికులంటే ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, కాంట్రాక్టర్లు చాలా నిర్లక్ష్య వైఖరితో ఉన్నారని, వీరి పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రశ్నించారు. యూనియన్ పిలుపు మేరకు గత 14 రోజులుగా జరుగుతున్న పోరాట కార్యాచరణలో భాగంగా విజయనగరం ప్రభుత్వం సర్వజన ఆసుపత్రి వద్ద ఈనెల 15 నుంచి 18 వ తేదీ వరకు నిరసన దీక్షలో భాగంగా బుధవారం సర్వజన ఆస్పత్రి వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్.రంగ రాజు, ఏ.పి. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.స్రవంతి, ఏ.పి గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ పురం అప్పారావులు సంఘీభావం తెలిపారు. అనంతరం బుగత అశోక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో గత 14 రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యమాలు చేస్తుంటే కాంట్రాక్టర్లు, జిల్లా వైద్యాధికారులు కనీసం స్పందించకుండా మొండివైఖరితో ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన జీతాలు అడిగితే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరింపులకి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఉద్యోగాలు ఎవరైతే తీసేస్తారో వారి ముందే ఆమరణ నిరాహారదీక్ష నేను సిద్ధమని హెచ్చరించారు. తెలంగాణా రాష్ట్రంలో ఉన్న టివిటి (గ్రూప్స్ కాంట్రాక్టరు వెంకటేశ్వరరావుని విజయనగరం రప్పించి సమాధానం చెప్పించమని అడిగితే ఎందుకు రప్పించలేకపోతున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టరుకి మీకు మధ్య లాలూచీ ఏంటి అని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫేస్ రికగ్నైజింగ్ సిస్టం (ఎఫ్.ఆర్.ఎస్) అంటే సెల్ ఫోన్ల ద్వారా హాజరు విధానాన్ని బలవంతంగా అమలు చేసి ఇప్పటికే చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న వారి బ్రతుకులు బుగ్గిపాలు చేస్తారా అని ఆగ్ర హం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2021 లో శానిటేషన్ వర్కర్స్ కి 16000 వేతనం ఇవ్వాలని జీఓ నెంబర్ 549, సెక్యూరిటి గార్డులకి 11,912 వేతనం ఇవ్వాలని జీఓ నెంబర్ 43 విడుదల చేస్తే కనీసం పట్టించుకోకుండా కొత్తగా వచ్చిన ఎఫ్.ఆర్.ఎస్ ను బలవంతంగా అమలు చేయడానికి కార్మి కులపై ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరం అయ్యేవరకు మా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహారాజా ఘోషా శానిటేషన్, సెక్యూరిటి, పెస్ట్ కంట్రోల్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని మరిపల్లి గ్రామంలో జరుగుతున్న రామన్న పట్నాయక్ చెరువు పనులను ఏపీవో సిహెచ్ రామారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్తర్లను పరిశీలించారు. గిట్టుబాటు ధర లభించేలా పనులు చేసుకోవాలని సూచించారు.

నేడు మద్యం దుకాణాలు మూసివేత

విశాలాంధ్ర - పార్వతీపురం: పట్టభద్రులు, స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఎన్నికల లెక్కింపు గురువారం జరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని మద్యం దుకాణాలు మూసివేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 135సి, ఏపి ఎక్సైజ్ చట్టం సెక్షన్ 20(1) క్రింద మద్యం దుకాణాలు, 2బి బార్లు, కల్లు దుకాణాలలో విక్రయా లు జరగకుండా మూసివేయడం జరుగుతుందన్నారు. లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యేవరకు మూసివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు

కలెక్టర్ సూర్య కుమారి

విశాలాంధ్ర - విజయనగరం: ఉగాది పండగ తర్వాత పొడి గాలులతో, వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరికలు ఉన్న దృష్ట్యా జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి అధికారులకు ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసిన వెంటనే క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించి 48 గంటల్లో బోరు బావులను, పైప్ లైన్లను మరమ్మతులను చేపట్టాలని, అందుకోసం యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్ఈ ఉమా శంకర్‌కు ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి సచివాలయం, ఆర్.బి.కె ల వద్ద, రైల్వే స్టేషన్ల వద్ద, ఆర్.టి.సి బస్సు స్టాండ్ల వద్ద, ప్రజలు ఎక్కువగా తిరుగాడే ప్రదేశాల్లో చలి వెంద్రాలను ఏర్పాటు చేయాలనీ అన్నారు.వేసవి సన్నద్ధత చలివేంద్రాల ఏర్పాటు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల హాజరు తదితర అంశాలపై బుధవారం ఎం.పి.డి.ఓలు, ఈ.ఓ.ఆర్.డి, ఆర్.డబ్ల్యు.ఎస్ ఏ.ఈలు, మున్సిపల్ కమీషనర్లతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పని చేసే వారు ఎండ తీవ్రతకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 22న ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఆ రోజు ఉగాది అయినందున ముందు రోజే జిల్లా అంతటా ప్రపంచ జల దినోత్సవం జరుపుకోవాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కాస్ట్ సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికీ ఎలాంటి పెండింగ్ లేకుండా జారీ చేయాలనీ సూచించారు. 10 వ తరగతి, ఇంటర్ వారికీ వెంటనే జారీ చేస్తే కాని తదుపరి అడ్మిషన్స్‌లో ఇబ్బంది పడతారని గుర్తుంచుకోవాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, డ్రాప్ ఔట్స్ ను గుర్తించాలని అన్నారు. ఇంటర్ పరీక్ష కు సుమారు 24 వేల మంది హాజరు కావలసి ఉండగా 1500 మంది అబ్సెంట్ గా గుర్తించడం జరిగిందని, వీరిని గుర్తించి తదుపరి పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను తనిఖీ చేయాలనీ, ఎంత మంది ఉన్నారు, ఎంత వండారు తనిఖీ చేయాలనీ, అదే విధంగా స్కూల్ మెంటేనన్స్ ఫండ్ ను ఎలా ఖర్చు చేస్తున్నారని పర్యవేక్షించాలని అన్నారు.

ఆదర్శ పంచాయతిగా నందిగాం

భోగాపురం మండలం నందిగాం పంచాయతీ జాతీయ స్థాయిలో ఆదర్శ పంచాయతీగా నిలిచినందుకు జిల్లా కలెక్టర్ సూర్య కుమారి అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ డా. అశోక్ కుమార్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఈ ఉమా శంకర్, మున్సిపల్ కమీషనర్ శ్రీరాములు నాయుడు, పబ్లిక్ హెల్త్ ఈ ఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి

విశాలాంధ్ర - తెర్లాం: మండల కేంద్రంలో సచివాలయం సిబ్బంది సెక్రటరీలతో, డిజిటల్ అసిటెంట్లతో బుధవారం మండల కార్యాలయం ఈఓపీఆర్డీ రేగిడి రాంబాబు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి రేగిడి రాంబాబు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో చేస్తున్న విధి నిర్వహణ ఏ మాత్రం బాగోలేదని అన్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి ఒక్క అభివృద్ధి పని తమకు చెప్పి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కోటమ్మతల్లి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర ప్రజల కొంగుబంగారం, కొట్టాం గ్రామదేవత శ్రీ కోటమ్మతల్లి హుండీల ఆదాయం రూ.6,75,329/-, నాలుగు గ్రాముల బంగారం, 398 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈఓ కె.నాగేంద్ర వెల్లడించారు. కొట్టాం గ్రామంలోని గద్దె ఆలయం ఆవరణలో జామి ఆలయ ఈఓ ఎం.ప్రసాద్, కోటమ్మ దేవస్థానం చైర్మన్ శానాపతి వెంకటరమణ, గ్రామ పెద్దలు, భక్తులు సమక్షంలో బుధవారం హుండీలను తెరిచి లెక్కించారు. కోటమ్మవారి పోతు పండుగ ముగిసిన వెంటనే అమ్మవారి ఉత్సవ మూర్తిని కొట్టాం గ్రామ శివారులో ఉన్న వనం గుడికి తరలించామని, ఇక నుండి అమ్మవారి దర్శనాలు వనం గుడిలో జరుగుతాయని ఈఓ నాగేంద్ర చెప్పారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

పబ్లిక్ హెల్త్ జిల్లా అధికారి దక్షిణామూర్తి

విశాలాంధ్ర - బొబ్బిలి: భోజరాజపురం ప్రధాన నీటి సరఫరా కేంద్రాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్, జిల్లా అధికారి దక్షిణా మూర్తి బుధవారం సందర్శించారు. సమ్మర్ ఏక్షన్ ప్లాన్‌లో భాగంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు నివారణా చర్యలు తీసుకుంటున్నట్టు తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న నీటి సాంద్రత తగ్గకుండా ఉండేటట్లు మూడు ఇంఫిల్టరేషన్ బావులు వద్ద నీటిని నిల్వ చేయుటకు జెసిబితో ఛానల్ తవ్వించాలని, ఇసుక బస్తాలతో క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ఉన్న లీకులను అరికట్టాలని అందుకుగాను అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీరి వెంట పైప్ లైన్ ఫిట్టర్, పంపు హౌస్ సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - డెంకాడ: ఇంటర్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి బుధవారం తనిఖీ చేశారు. ఆమె డెంకాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌ను సందర్శించారు. త్రాగునీరు, తరగతి గదిలో లైట్లు, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష నిర్వణకు తీసుకున్న చర్యలను కళాశాల ప్రిన్సిపాల్ వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుతించవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు 19,880 మంది సాధారణ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 19,140 మంది హాజరయ్యారు. 740 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 5945 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 5,249 మంది హాజరయ్యారు. 696 మంది గైర్హాజరయ్యారు. మొత్తంమీద తొలిరోజు పరీక్షను 24,389 మంది రాశారు. మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద విధి నిర్వహణలో ఎంఎస్‌పీలు

విశాలాంధ్ర - సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగు కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించిన గ్రామ సచివాలయాల ఎంఎస్‌పిలు బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలలో కూడా విధులు నిర్వహించారు. తెలంగాణాలో ఇటీవల పరీక్షలలో జరిగిన పరిణామాలు దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలు మేరకు ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఇద్దరు పోలీస్ సిబ్బందితో పాటు నలుగురు ఎంఎస్‌పిలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, జోగమ్మపేట ప్రతిభ కళాశాల వద్ద ఎనిమిది మంది ఎంఎస్‌పిలకు విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. దీంతో పాటు గ్రామ దేవత పండుగల్లో కూడా వారికి కొన్ని బాధ్యతలు అప్పగించి సజావుగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. మొదటి రోజు బుధవారం ఇంటర్ పరీక్షల సమయంలో వారు విధుల్లో ఉన్న సమయంలో పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శన చేశారు.

ఐదుగురితో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: కాంగ్రెస్ పార్టీ ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రాకేష్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కోట నియోజకవర్గానికి సమన్వయ కమిటీ సభ్యులుగా హనుమాన్ శెట్టి సన్యాసిరావు (నానాజీ), శ్రీని వాసరావు, మంతాడ అప్పారావు, గోకేడ సత్యారావు, బూడి అప్పారావు (జగదీష్)లను నియమించిందని హనుమాన్ శెట్టి సన్యాసిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు నియోజకవర్గ పరిధిలో పార్టీని ప్రజలకు చేరువ చేసేందుకు కార్యక్రమాలు నిర్వహణ, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు నడ ిపించే దిశగా పనిచేయనుందని సన్యాసిరావు పేర్కొన్నారు. కాగా అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులుగా అధిష్టానం ఎంపిక చేసిన వారిని కాంగ్రెస్ పార్టీలో జిల్లా, మండల నాయకులు అభినందించారు.

19న ఉగాది వస్త్రధారణ పోటీలు

విశాలాంధ్ర - బొబ్బిలి: ఈనెల 19 ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో జరగనున్న పదవ ఆనందోబ్రహ్మ ప్రదర్శనలో ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక కదంబ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు యం.విజయ మోహనరావు తెలిపారు. ఎప్పటిలాగే ఔత్సాహిక కళాకారుల సకల కళా ప్రదర్శనలతో పాటు, తెలుగుదనాన్ని ప్రతిబింబించే సాంప్రదాయ వస్త్రధారణ పోటీలను కూడా నిర్వహిస్తున్నామని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు యం.విజయ మోహనరావు తెలిపారు. బుధవారం హ్యాపీ క్లబ్ కార్యాలయంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. అచ్చ తెలుగు పురుషుల పంచ కట్టు, తెలుగు మహిళల చీర కట్టు, తెలుగు అమ్మాయిల పట్టు పరికిణి ఓణీలు, తెలుగు బాల బాలికల దుస్తులతో ప్రదర్శనలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న అన్ని వయసుల వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. వీటిలో పాల్గొనేవారు ఈనెల 18 సాయంత్రం లోగా తమ వివరాలను 9440744741 లో నమోదు చేసుకోవాలని కోరారు. సకల కళా ప్రదర్శనలో భాగంగా ఉగాది పండుగ విశిష్ట తెలిపే నృత్యాలు, కర్ర సా ము, గంగిరె ద్దు నృత్య ప్రదర్శన, హాస్య నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. కేవలం పది రూపాయల టికెట్‌తో సాయంత్రం ఐదు గంటలకే ఆడిటోరియం చేరుకుని కళాకారులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు డివి అప్పారావు, రాముద్ర గోవింద రావు, పి నాగరాజు, ఎం వెంకటరావు, కే పరంకుశం పాల్గొన్నారు.

అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం

విశాలాంధ్ర -విజయనగరంటౌన్: అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో వినియోగదారుల దినోత్సవ ప్రాముఖ్యతను, సభ్యులకు ప్రముఖ సంఘసేవకులు, మేధావి డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశరావు మాట్లాడుతూ మన దేశంలో 1986లో వినియోగ దారుల రక్షణ చట్టం అమలులోకి వచ్చిందని, ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం వినియోగదారులకు ఆరు హక్కులను కల్పించిందని వీటి ద్వారా వినియోగదారులకు రక్షణ హక్కు, సమాచార హక్కు, వస్తు సేవలు చేసుకునే హక్కు, ప్రాతినిధ్య హక్కు, విజ్ఞాపన హక్కు, విద్యా హక్కుల ప్రయోజనాలు కలుగుతాయని, ఈ చట్టాలు రాక మునుపు కోర్టును ఆశ్రయించే వారని, ఈ చట్టాలు అమలు చేయడంతో ప్రజలంతా హక్కులను వినియోగిం చుకుంటున్నారని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు(సి.హెచ్. రమణ) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ఎ.తిరుపతి రావు, పైడయ్య, నలమరాజు, వి.శ్రీనివాసరావు, టి.ఆదినారాయణ, ఆర్.సి.హెచ్.అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుంది

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: క్రీడలకు, క్రీడాకారులకు, యువతకు తమ వంతు ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. పర్వతారోహకుడు, జిల్లా రాజాం నియోజకవర్గం రేగిడి మండలం ఉ ణుకూరు గ్రామానికి చెందిన మెరుగుల నాగరాజు బుధవారం ఈశ్వర్ కౌశిక్‌ను తన కార్యాలయంలో కలిశారు. మెరుగుల నాగరాజు త్వరలో చేపట్టనున్న ఎవరెస్టు అధి రోహణకు ఆర్థిక సహాయంతో పాటు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ పర్వత అధిరోహణను ప్రేమించే నాగరాజు గతంలో ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో 5, 985 మీటర్ల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని కేవలం ఏడు రోజులలో అధిరోహించాడు అని తెలిపారు. అలాగే సిక్కిం రాష్ట్రంలోని 5,450 మీటర్ల ఎత్తు గల లఖో ఖాన్ సే పర్వతాన్ని అధిరోహించి శభాష్ అనిపించుకుని, ఆ రాష్ట్ర ప్రభుత్వం బంగారు పతకం తో పాటు, ఉత్తమ అధిరోహకుడు, ఉత్తమ మారధా న్ పురస్కారాన్ని కూడా అందుకున్నట్టు తెలిపారు. ఎవరెస్టు అభిరోహణ లక్ష్యంగా చేసుకున్న నాగరాజుకు తమ వంతు ప్రోత్సాహం అందించడం జరిగిందని అన్నారు. యువతకు ఎప్పుడు తమ వంతు ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. పర్వతారోహుకుడు మెరుగుల నాగరాజు మాట్లాడుతూ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకు న్నానని అన్నారు. విజయవాడలోని వికాస్ కాలేజీలో బి పి డి తీసుకున్నానని తెలిపారు. తన గ్రామంలోని ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహ కారంతో ఈ స్థాయికి చేరుకున్నానని, ఈశ్వర్ కౌశిక్ ప్రోత్సాహం మరవలేదని అన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

విశాలాంధ్ర - విజయనగరం క్రైం: మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సెబ్‌కు సంబంధించిన నేరాలు నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ హస్మాఫరహిన్ ఆదేశించారు. విజయనగరం వన్‌టౌన్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సెబ్ స్టేషన్లో వాహనాలు, రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విజయనగరం వన్‌టౌన్ పరిధిలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో సారా, మద్యం అమ్మకాల నియంత్రణకు చేస్తున్న చర్యలు సంతృప్తిగా ఉన్నాయన్నారు. మహిళా పోలీసులకు విధి నిర్వహణలో తగు సలహాలు సూచనలు అందించారు.

సంధ్యారాణికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు

విశాలాంధ్ర - పార్వతీపురం: అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ శాసనమండలి సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి పుట్టినరోజు సందర్భంగా పలువురు నేతలు ఆమె స్వగృహం సాలూరు వెళ్ళి చెప్పగా, చాలా మంది ఫోన్లు ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, పార్వతీపురం మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, పార్వతీపురం మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బోను దేవి చంద్రమౌళి, పార్వతీపురం నియోజకవర్గం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సువ్వాడ శ్రీనివాస్ తదితరులు శు భాకాంక్షలు తెలిపారు.

నిడగల్లు ఎస్సీ కాలనీలో రిగ్ బోర్

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామంలో ఎస్సీ కాలనీలో చర్చివద్ద 70వేల రూపాయలతో నూతనంగా నిర్మించిన రిగ్ ద్వారా మంచినీటి బోరును బుధవారం త్రవ్వించారు. ఇక్కడ నీటివసతికి ఇబ్బందులు గుర్తించి బోరును తవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరుద్ర, గ్రామ పెద్ద గాజాపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సూర్యనారాయణ, సెక్రెటరీ తిరుపతిరావు, కృష్ణపల్లి గ్రామ రెవెన్యూ అధికారి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

21 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధికి చెందిన తాడితూరి వెంకట రమణ 21 మద్యం సీసాలు అమ్ముతుండగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది అతడ్ని పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ జై భీమ్ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, సారా అమ్మకాలు చేస్తే 9440902372 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది చంద్ర ప్రసాద్, జయరామ్, మహిళా పోలీస్ రేఖా గాయత్రి, వాలంటీర్ బిందు మాధవి తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులను సంరక్షించుకోవాలి



విశాలాంధ్ర - గజపతినగరం: గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకొని పశువులను సంరక్షించుకోవాలని వైసీపీ యువజన నాయకులు లంక గణేష్ కోరారు. బుధవారం మండలంలోని కింగువ గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు నష్టం జరిగినప్పుడు బీమా పొందాలని, ట్యాగ్ కూడా కట్టించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండల సురప్పడు, ఎంపీటీసీ సునీత, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత బగ్గాంలో రోడ్డు విస్తరణ పనులు

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని పాతబగ్గం గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు గ్రామ సర్పంచ్ లంక పద్మావతి, టిడిపి నాయకులు చిన్నమ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గ్రామంలో ఇరుకు రహదారికి మోక్షం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సుజాత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

అమ్మ సేవా సమితి అన్న ప్రసాద వితరణ భేష్

విశాలాంధ్ర - పార్వతీపురం: గుంటూరు జిల్లా బాపట్ల జిల్లెళ్ళమూడి అమ్మసమక్షంలో ఉండే మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల, (జిల్లెళ్ళమూడిలో) బాషా ప్రవీణ, విద్యా ప్రవీణలో40సంవత్సరాల క్రితంశిక్షణలు పూర్తి చేసుకొని ఈప్రాంతంలో తెలుగుఉపాధ్యాయులుగా వివిధ ప్రాంతాలలో సేవలు అందించి పదవీవిరమణ చేసి పార్వతీపురం ప్రాంతములో స్థిర నివాసం ఏర్పరుచుకున్నామని, పదవీ విరమణ చేసిన ఈ తెలుగు ఉపాధ్యాయులు జిల్లెళ్ళమూడి అమ్మను ఆదర్శంగా తీసుకొని, ఆమెచెప్పిన మాట ప్రకారం నీకున్నది తృప్తిగాతిని యితరులకు ఆదరంగా పెట్టుకోఅన్న దానిని ఆచరించాలనే ఉద్దేశ్యంతో పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రంలో గతఏడాది ఆగస్టు ఆరున జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి, పార్వతీపురంపేరుతో ఒక సేవాసంస్థను స్థాపించారు. నాటినుండి పార్వతీపురం జిల్లాఆసుపత్రి ఆవరణలో రోజుకు వందమందినుండి 150మంది వరకు రోజూ ఉచితంగాభోజనం అందిస్తున్నారు. రోజూ వివిధ ప్రాంతాల నుండి వస్తున్న రోగులకు,వారి సహాయకులు, అమాయక గిరిజనులకు, వృద్ధులకు, గర్భిణీలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. చివరకు ఇక్కడ ఆసుపత్రిలో సేవలు అందించే చిరు ఉద్యోగులు, ట్రైనీలుకూడా వీరి అన్న ప్రసాదంపై ఆధార పడుతున్నారు. ప్రారంభం నుంచి నిర్విరామంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గతమూడు రోజులుగా భోగీ సంక్రాంతి కనుమ రోజుల్లో కూడా ఆసుపత్రిలో వారు అందించే అన్న ప్రసాద వితరణను పలువురు అభినందించారు. కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభించడం ఎంతో సంతృప్తి నిస్తుందని జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి పార్వతీపురం వ్యవస్థాపకులు గంటేడ.చిన్నం నాయుడు,అధ్యక్షులు గంటేడ సోమేశ్వర రావులు చెప్పారు. అమ్మకుటుంబం పార్వతీపురం శాశ్వత సభ్యులుగా 95మందిని చేర్చుకోవడం జరిగిందని, ప్రతీఒక్కరూ నెలకు కనీసం వేయిరూపాయలు నుండి ఐదువేల రూపాయలు వరకు వీరంతా చెల్లిస్తూ కార్యక్రమాన్ని నడిపిస్తున్నారు.ఎంతోమందికి రోజూ ప్రేమగా ఆకలితీరుస్తున్న ఈనిరంతర అన్నదానకార్యక్రమం పలువురి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతుందని,ఇంకాఅనేకమంది సేవా సమితిలో చేరడానికి ఉత్సాహం చూపిస్తున్నారని నిర్వాకులు చెబుతున్నారు.ఇందుకుగాను ప్రతి సభ్యుడు నెలకు వెయ్యిరూపాయలు విరాళంగా ఇస్తున్నారని తెలియజేశారు.దానితోపాటు మానవ సేవయే మాధవసేవగా భావించి స్థానిక ప్రజలుకూడా పెద్ద ఎత్తున సహకరిస్తూ వారి పుట్టినరోజులు ,పెళ్లిరోజులు తదితర కార్యక్రమాల సందర్భంగా ఆసుపత్రిలో అన్న ప్రసాద వితరణకు సహాయం చేస్తున్నారని చెప్పారు. ప్రారంభం నుండి ఇంతవరకు నిరంతరం,నిర్విఘ్నంగా నడిపిస్తూ 5వందలరోజులు పూర్తి చేయగలుగుతున్నందుకి ఎంతో సంతోషంగా ఉందని జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి అధ్యక్షులు జి.సోమేశ్వర రావు,కార్యదర్శి జి.చిన్నంనాయుడులు చెప్పారు. ప్రతీరోజూ ఉదయం 11.30గంటలకే జిల్లాఆసుపత్రి వద్దకు సభ్యులంతా చేరుకొని ఒంటిగంట వరకు ఉండి ఆసుపత్రికివచ్చే ఎవరికకైన ఇక్కడభోజనం పెట్టడం జరుగుతుందని చెప్పారు. ఇది విశ్వజననని జిల్లెళ్ళమూడి మాకుప్రసాదించిన అనుగ్రహమని ,దీనిని నిరంతరంకొనసాగిస్తామని జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి సభ్యులు బడే.శ్రీరాములు,భవిరిపూడి.శ్రీరామమూర్తి నాయుడు, శీలంకి

మన్యం జిల్లాలో అందరి మన్ననలను అందుకుంటున్న అమ్మా సేవా సంస్థ కార్యక్రమాలు 587రోజుల నుండి నిరాటంకంగా కొనసాగుతున్న కార్యక్రమం

త్రినాథరావు,అడివి నాయుడు, గోర్లి.దాలినాయుడు బి.తిరుపతిరావు,తిరుపతి రావు,సిరికి.త్రినాథరావు,గంగు నాయుడు,బి గౌరునాయుడు,శేషగిరి రావు,సర్వేశ్వరరావు,కృష్ణారావులు విశాలాంధ్రకు తెలియజేశారు. ఆసుపత్రి ఆవరణలో అమ్మా సేవాసమితి కార్యక్రమాలను జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, డాక్టర్లు,ఆసుపత్రి సిబ్బంది, రోగులు,పార్వతీపురం పురప్రముఖులు అభినందించారు. వారుచేస్తున్న అన్నదానకార్యక్రమం రోగుల సహాయకులకు, సేవా ఉద్యోగులకు,నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. దీంతో పాటు జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నామని తెలిపారు. తమ సేవలకు శాశ్వత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే జోగారావుకు కూడా వినతి పత్రాన్ని అందజేసామని తెలిపారు. ఆయన స్థలాన్ని కేటాయిస్తే సభ్యులు ఆర్థిక సహాకారంతో భవన నిర్మాణం చేపట్టి కార్యక్రమాలను ముమ్మరంగా చేస్తామని చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాన్ని అద్దెకు తీసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.అప్పట్లో తాము ఎన్నో కష్టాలు పడి అమ్మదయతో నేడు ఆనందంగా ఉంటున్నామని,పదవీ విరమణ చేసిన తామంతా పదిమందికి అన్నదానం చేయడానికి చేపట్టిన కార్యక్రమానికి ఎటువంటి అవరోధాలు లేకుండా జరుగుతుండటం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లెళ్ళమూడి నుండి విచ్చేసిన పలువురు కూడా ఇక్కడి కార్యక్రమాలను చూసి ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారన్నారు.వివిధ ప్రాంతాల నుంచి చాలా మంది అన్నదాన కార్యక్రమం చేయడానికి ముందుకు రావడం, ఇక్కడ ఆసుపత్రిలో రోగుల బంధువులు,నిరుపేదలు,ఆసుపత్రిలో ఉండే సిబ్బంది తమ సేవలను గుర్తించడం ఎంతో ఆనందం కలుగుతుందన్నారు.మరిన్ని సేవా కార్యక్రమాలు కూడా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.పట్టణంలో వీరిని ఆదర్శంగా తీసుకొని మరికొన్ని సంస్థలు కూడా పేదలను ఆదుకుంటున్న తీరు అభినందనీయం. అమ్మ ఆశయ సాధనకు, లక్ష్యాలు నెరవేర్చేందుకు అంతా కలిసికట్టుగా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించేందుకు అమ్మ ఆశీస్సుల వల్లనే సాధ్యం అవుతుందని వారంతా తెలిపారు.

తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులపై ఆరా

విశాలాంధ్ర-పాలకొండ: బుధవారం తనను కలిసిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో తోటపల్లి ఆధునీకరణ పనులు ఎలా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసి రైతులకు మూడు పంటలకు సాగునీరు అందించేలా చొరవ చూపాలని తెలిపినట్లు పాలవలస విక్రాంత్ విలేకరులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి మండలంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఐశ్వర్య లక్ష్మి యాక్సిడెంట్ ప్రోనే ఏరియాస్ సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ జాయింట్ ఇన్స్పెక్షన్ లో అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్‌లు రాజంకు చెందిన నాగభూషణం, తెర్లాంకు చెందిన ఐ వి ఎస్ జగన్నాథం, బాడంగి కి చెందిన ప్రణయ, బొబ్బిలి కి చెందిన రాజు మరియు తెర్లాం ఎస్ ఐ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబాన్ని బేబీ నాయన పరామర్శ

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో ఇటీవల బూరిపేట సర్పంచ్ బూరి మధుసూదన్‌రావు తండ్రి మాజీ ఎంపిటిసి అప్పలస్వామి నాయుడు అనారోగ్యం కారణంగా మరణించిన సంగతి తెలిసిందే. అయితే బొబ్బిలి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో ఇంచార్జ్ బేబీ నాయన బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు నర్సిపల్లి వెంకట నాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు గులివెందల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మధు, గణపతి గ్రామ నాయకులు సూర్యనారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మజ్జి గౌరమ్మ తల్లిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర - బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలో గల అప్పయ్యపేటపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ మజ్జి గౌరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 14వ వార్డు కౌన్సిలర్, వైసీపీ నాయకులు ఆహ్వానం మేరకు బుధవారం ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు హాజరై మజ్జి గౌరమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. వారి వెంట వైసీపీ నాయకులు రెడ్డి దామోదర్, బొద్దల సత్యనారాయణ, మండల జనార్దన్ తదితరులు హాజరయ్యారు.

పది లీటర్ల నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర -సీతంపేట: మండలం మండ పంచాయతీ దిగువ దీసరగూడ గ్రామానికి చెందిన సవర సుధాకర్ 10 లీటర్ల నాటు సార తరలిస్తుండగా సబ్ ఇన్స్పెక్టర్ నీలకంటా రావు తమ పోలీసు బృందంతో వెళ్లి పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో నాటు సారా తయారీ చేసిన, ఖైనా గుట్కాలు అమ్మిన, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్

విశాలాంధ్ర - పాలకొండ: మండలంలో సత్యసాయి, తమ్మి నాయుడు, సాహితీ జూనియర్ కళాశాల తోపాటు వీరఘట్టం మండల కేంద్రం లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టరు, నూరుల్ కమర్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. అక్కడ పరిస్థితులు పరిశీలించారు.

ప్రతీ నెలా 14న హెల్త్ మేళాలు నిర్వహణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు జగన్నాధం

విశాలాంధ్ర - సీతానగరం: ప్రతీనెల 14న జిల్లాలోని అన్ని హెల్త్ వెల్నెస్ సెంటర్లలో హెల్త్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టరు బగాది జగన్నాథరావు అన్నారు. నిక్షయ్ దివాస్ సంధర్భంగా మండలంలోని జోగింపేట, మరిపివలస సబ్ సెంటర్లలో లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వైఎస్ఆర్ హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో టి బి అవేర్‌నెస్ అండ్ సర్వీసెస్ అనే థీమ్ ప్రకారం నిక్షయ్ దివాస్ హెల్త్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వస్త్ మాన్, స్వస్త్ ఘర్ ఆరోగ్యకరమైన మనస్సు ఆరోగ్యకరమైన ఇల్లు అనే టాగ్ లైన్ తో సచివాలయం పరిధి లోని ప్రజలకి టి.బి స్క్రీనింగ్ పరీక్షలు, నమూనా సేకరణ , రవాణా, టిబి కోసం టెలి-కన్సల్టేషన్ సేవలను అప్‌డేట్ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1907 టిబి వ్యాధి గ్రస్తులు ఉన్నారని, 2015 -2022 కాలంలో 40 శాతం మేరకు కేసులు తగ్గుముఖం పట్టాయని , దేశవ్యాప్తంగా లక్ష మందికి గాను 200 పాజిటివ్ కేసులు నమోదు అవుతుండగా జిల్లా లో లక్ష మందిలో 190 పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నట్లు వివరించారు. నెలకు 1650 నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీ.బి.రహిత జిల్లా లక్ష్యంగా హెల్త్ మేళా లు పనిచేయాలని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిబి నియంత్రణ అధికారి డా. శ్యామ్ కుమార్, వి హెచ్‌సి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. వినోద్ కుమార్, వైద్యులు శిరీష,ఉషారాణి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సామాలమ్మతల్లి తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని బొద్దవర రైల్వే స్టేషన్ వద్ద శ్రీసామా లమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం తొలేళ్ళ ఉత్సవంతో ప్రారంభమైన పండుగ మహోత్సవం మంగళవారం అనుపోత్సవంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టు పక్కల పలు గ్రామాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈమేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమరాధన కార్యక్రమం నిర్వహించారు. గత 40 ఏళ్లుగా ప్రతీ యేటా సామాలమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. శ్రీసామాలమ్మతల్లి అమ్మవారి పండుగ మహోత్సవాన్ని రైల్వే కమిటీ సభ్యులు అత్యంత ఘనంగా నిర్వహించారని భక్తులు, పలు గ్రామాల ప్రజలు కొనియాడారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా గంటి

విశాలాంధ్ర - బొబ్బిలి: స్థానిక కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా గంటి గోపాలకృష్ణశర్మను న్యాయవాదులు ఎన్నిక చేసినట్లు విలేకరులకు తెలిపారు. బుధవారం స్థానిక కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలు ప్రముఖ సీనియర్ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ నాయకులు గంటి గోపాలకృష్ణ శర్మ ను ఎన్నిక కావడంతో స్థానిక న్యాయవాదులు తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద వాహన తనిఖీలను చేస్తున్న సమయంలో గంజాయి తరలిస్తున్న మహిళతో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ సిఐ బి వెంకటరావు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 1వ పట్టణ పోలీసులకు సమాచారం మేరకు ఈనెల 14వ తేదీ రాత్రి రైల్వే స్టేషను కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. బుధవారం తెల్లవారు జామున ఒడిస్సా రాష్ట్రంకు చెందిన ముగ్గురు వ్యక్తులు బ్యాగులతో రైల్వే స్టేషను సమీపంలో అనుమానస్పదంగా సంచరిస్తుండగా, సిఐ వెంకటరావు, సిబ్బంది వారిని ఆపి, బ్యాగులు తనిఖీ చేయగా, వారి బ్యాగుల్లో 20కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వారిని ప్రశ్నించగా తాము ఒడిస్సా కోరాపుట్ జిల్లాకు చెందిన వారమని, డబ్బులు సంపాదించుకోవాలనే లక్ష్యంతో తమ రాష్ట్రం నుండి గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఎ-1 కోరాపుట్ జిల్లా నారాయణపట్న బ్లాక్ బర్లి గ్రామానికి చెందిన ప్రమోద్ కుమార్ కోస్ల, ఎ-2 కోరాపుట్ జిల్లా దమన్ జోడి కి చెందిన, ఎ-3 కోరాపుట్ జిల్లా దమన్ జోడికి చెందిన తులసీ కులదీప్ గుర్తించారు. నిందితుల వద్ద నుండి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, రిమాండుకు తరలించినట్లుగా సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో 1వ పట్టణ ఎస్ఐలు రామ గణేష్, భాస్కరరావు, ఎఎస్ఐ మన్మదరావు, హెడ్ కానిస్టేబులు ఎ.వి.రమణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో వివాహితకు పురిటి నొప్పులు

విశాలాంధ్ర - బెలగాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ పరీక్ష రాస్తున్న పాలవలస దేవి అనే గర్భిణీకి పురిటి నొప్పులు వచ్చాయి. పరీక్ష రాస్తుండగానే నొప్పులు మొదలవడంతో ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది అప్రమత్తమై జిల్లా ఆసుపత్రికి తరలించారు. 22 ఏళ్ల దేవికి వివాహమై మూడు సంవత్సరాలయింది. ఆమె డిగ్రీ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగ అవకాశాలకై ఒకేషనల్ కోర్సు పరీక్ష రాస్తుంది.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

విశాలాంధ్ర - పాచిపెంట: మండల కేంద్రమైన పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల పికోనవలస గిరిజన బాలుర రెసిడెన్సి కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 184 మంది మాత్రమే హాజరైనట్లు డిపార్ట్మెంటల్ చీఫ్ ఎల్.ప్రసాద్ తెలిపారు. అలాగే ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో 331 మంది హాజరై ప్రశాంతంగా పరీక్షలను వ్రాశారు. బాలికలు 150 మంది కాగా బాలురు 151 మంది హాజరై మొదటి సంవత్సరం తెలుగు పరీక్షలను రాశారు. ఈ కళాశాలకు చీఫ్ సూపర్డెంట్‌గా అప్పలనాయుడు వ్యవహరించారు. ఆఫీసర్ జగన్ మోహన్‌రావు పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేపాడ: మండల కేంద్రంలోని వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా బుధవారం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదట రోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 240 మంది విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాయాల్సి ఉండగా 232 మంది హాజరై పరీక్షలు రాశారు. 8 మంది పరీక్షకు హాజరు కాలేదని డిపార్ట్మెంటల్ ఆఫీసర్ కె.దివాకర్ తెలిపారు. అలాగే కే దివాకర్ ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. గురువారం నుంచి రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కిలపర్తి అప్పారావు తెలిపారు.

శృంగవరపుకోట : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రారంభమయ్యాయి. ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పుణ్యగిరి, వివేకానంద, విజ్ఞానజ్యోతి, చైతన్య, ఏవీఎన్, తాటిపూడిలోని గురుకుల బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన 7 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని, ఆయా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ ఈనెల 29వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఎస్.ఐ జె.తారకేశ్వరరావు వెల్లడించారు. కాగా పరీక్ష ప్రారంభానికి ఒక్క నిమిషం ఆలస్యమయినా అభ్యర్థిని

అనుమతించమని ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేయడంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఇక మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమ హాల్ టికెట్లు పట్టుకుని కేంద్రంలో కేటాయించిన గదులను సరి చూసుకోవటం కేంద్రాల వద్ద కనిపించింది.

సీతంపేట: మండల కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ఏపీఆర్జెసీ గర్ల్స్ 86 మంది విద్యార్థులకు గాను 85 గురు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, అదేవిధంగా ఒకేషనల్ గ్రూపుకు సంబంధించి 157 మందికి గాను 154 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ సూర్య కుమారి తెలిపారు. అదే విధంగా ఏపీఆర్జేసీ బాయ్స్ 226 మందికి గాను 225 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ విశ్వనాథం తెలిపారు. ప్రతిభ కళాశాల (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) మల్లీ ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపిసి గ్రూప్ నుండి 40 మంది విద్యార్థులు, ఎంపీసీ గ్రూప్ నుండి 40 మంది విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగిందని ప్రిన్సిపాల్ యుగంధర్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ఒక్క నిమిషం నిబంధన అమలు చేయడం అన్యాయం

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల

విశాలాంధ్ర - బెలగాం : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఒక్క నిమిషం నిబంధనను అమలు చేయడం చాలా అన్యాయమని ప్రభుత్వం వెంటనే ఈ నిబంధనను ఎత్తివేయాలని ఏపీ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అత్యధిక శాతం మంది గ్రామాల నుండి దూరంగా ఉండే పట్టణాల్లో గల పరీక్షా కేంద్రాలకు రావడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల నుండి సకాలంలో బస్సు సౌకర్యం, రవాణా సౌకర్యం దొరకని పరిస్థితి ఉంటుందన్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించకూడదని ప్రభుత్వం నిబంధన విధించడం చాలా అన్యాయమన్నారు. సంవత్సరం కాలం పాటు కష్టపడి చదువుకున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఒక్క నిమిషం ఆలస్యానికి ఏకంగా పరీక్షలు రాయకుండా చేయడం ఎంత మాత్రం సరికాదన్నారు. ఈ నిబంధన వలన ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. నిమిషం నిబంధనతో విద్యార్థులను పరీక్ష రాయనివ్వకపోతే ఆ విద్యార్థులకే కాకుండా వారి తల్లిదండ్రులు కూడా ఎంతో మానసిక క్షోభకు గురవుతారని విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తంచేశారు. కావున ప్రభుత్వం మానవతా

దృక్పథంతో పై అంశాలన్నిటిని దృష్టిలో పెట్టుకొని ఈ నిబంధనను వెంటనే ఎత్తివేయాలని, కనీసం పది నిమిషాల ఆలస్యానికి అనుమతించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వస్తువుల కొనుగోలులో వినియోగదారులు జాగ్రత్తలు వహించాలి

విశాలాంధ్ర - బెలగాం: న్యాయమైన వ్యాపారం, నాణ్యమైన వస్తు సేవలు అందిన రోజు వినియోగదారుడే రాజు అవుతాడని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు అన్నారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని శ్రీవారి సన్నిధి కళ్యాణమండపంలో వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే కార్యక్రమాన్ని ఆ సంస్థ ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు చందక అనిల్ కుమార్, జామి శ్రీనివాసరావు, వంగల దాలి నాయుడు, పాటి శ్రీనివాసరావు, కొత్త సన్యాసిరాజు, బంకురు ప్రకాష్ రావు, పొట్నూరు పైడిరాజు, నెయ్యి గాపుల సురేష్, ఎం తవిటి నాయుడు, వై. శ్రీనివాస్ నాయుడు, పొట్నూరు రేవంత్ కుమార్ తదితరులు పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా నియమింపబడిన చందక అనిల్ కుమార్ కు పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం వారు వినియోగదారుడా మేలుకో అనే కరపత్రాన్ని, స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు కన్స్యూమర్ రైట్స్ పై, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అన్న పానీయాలు మొదలు దైనందిన జీవితంలో మనిషికి ఉపయోగపడే అన్ని వస్తువులు కొనుగోలులో వినియోగదారుడు జాగ్రత్త వహించాలన్నారు. వ్యాపారులు కూడా న్యాయమైన వ్యాపారం చేసి నాణ్యమైన వస్తువులు అందించాలన్నారు. అనంతరం పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డులో మైక్ సెట్ తో ప్రచారం నిర్వహించి ప్రచార ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.